కథా నిలయం
శ్రీకాకుళం

# రేపటి రూపు

"ఈ రోజన్నా నల్లాల నీళ్లొస్తయో రావో..." గుడిశె గోడ కొరిగి కూచున్న భూలక్ష్మి తనలోతానే గొణుక్కుంది. నాజూకు వేళ్లమీద బీడీలు నల్లేరుమీద బండి నడకలా తయారవుతున్నాయి. మనసు... తెగిన గాలిపటంలా ఎటెటో పరుగులు తీస్తోంది.

నిద్దుర పద్దుకు హద్దులు ఏర్పరుచుకుని.... రోజూ తెల్లవారకముందే ఆకు కత్తిరించుకుంటుంది. వేడి చాయ తాగి కత్తిరించిన ఆకు, పొగాకుపొడి, దారము ముందే సుకుని వాడిగా బీడీలు చుడుతే రెండు మూదొందలు దాటేస్తుంది. అటు పిల్లలు నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకునేలోగా ఇటు మూడు ముళ్లేసిన వాడితో మూడేళ్ల.... దాంపత్య జీవితం, ఇద్దరు పిల్లలనిచ్చేసి ఒంటరిగా మార్చేసిన వైనం పొగబారిన కళ్లల్లో మొదల్తుంటాయి. పిల్లలకు నాలుగు ముద్దలు తినిపించి బడికి పంపిస్తుంది. ఆ తర్వాత గుడిశెకు తాళమేసి, తాను పక్కింటి కెళ్లడమో లేక పక్కింటి పోశవ్వ తనింటికి రావడమో జరుగుతుంది.

ఇద్దరూ కలిసి బీడీలు చుడుతూ లోకాభి రామాయణంలోకి దిగిపోతారు. చిన్నప్పటి పుట్టింటి సరిగమలు, బడిలో ఆటల పదనిసలు, పెళ్లయాక అత్తింట్లో కొత్త కాపురం చిత్రాలు, పాత సినిమాల పటాటోపం..... మరెన్నో విషయాలు చోటుచేసు కుంటాయి. మధ్యాహ్నం నాలుగు మెతుకులు ఎంగిలిపడ్డాక మళ్ళీ ఆకు, పొగాకు ముందుకొస్తాయి. బీడీల పని చకచకా సాగిపోతుంది. బతుకు బండి ముందుకు నడుస్తుంది.

ఇటే రమ్మని పోశవ్వకు చెప్పి అర్ధగంటైంది. ఇంకా ఎందుకు రాలేదో... ఎక్కడన్నా నీల్లు దొరుకుతున్నాయని తెలిసిందా?

"లచ్చుక్కా!" అంటూ అప్పుడే పోశవ్వ చాటతో వచ్చి కూచుంది.

"పెద్దపిల్ల పెద్దమనిషై మూడ్రోజులైంది గదా!" అనడిగింది.

భూలక్ష్మి మొహం చాటైంది.

"ఇయ్యాల్ల స్నానం చేయించాలెగదా!" పొగాకుపొడి బుట్టను ముందు కు జరుపుకుంటూ ప్రస్తావించింది పోశవ్వ.

"నిజమే పోశక్కా..... చేయించాలే. కాని నీళ్లెట్లా? నల్లా వచ్చి నాల్రోజులు దాటి పాయె. ఇయ్యాల్ల నీళ్లు దొరకకుంటే ఆగమై పోవాలె" కళ్లల్లో ఆందోళన.

ఆకు చుట్టడం, పొగాకు నింపడం, మూతి మడచి దారం చుట్టి పడెయ్యడం, బీడీల తయారీపని యాంత్రికంగా సాగిపోతోంది. ఆ వేళ్లతో ఏ యంత్రమూ పోటీపడలేదు. జీవనదుల కాల్వలు లేక జీవితాలను పరీక్షలకు నిలబెట్టిన తెలంగాణా ప్రాంతంలో ఓ పట్టణమది. భూగర్భజలాలు అడుగంటి బోరుబావులమీద ఆధారపడమని శపించాయి ఆ ప్రాంతాన్ని.

"చిన్నపిల్ల ఏం తినిపోయింది బడికి?" అడిగింది పోశవ్వ. పొద్దున నీళ్లు లేక వంటచెయ్యలేదని అప్పటికే తెలిసిపోయింది.



ఐతా చంద్రయ్య

"బన్ను కొనిచ్చిన. అదే జెరంత దిని జెరంత బాక్సుల పెట్టుకొనిపోయింది. మీ పిల్లగాడు... గదే... నీకొడుకు ఉత్తరం రాసిండా?"

పోశవ్వ కొడుకు బాంబేలో కూలీగ పనిజేస్తున్నాడు.

"వాడి దగ్గర్నుంచి ఉత్తరంలేదు పత్రం లేదు. ఒక్క పైసా పంపలేదు. అక్కడ గూడా కాయకష్టంజేసిన పైసల్ని సినిమాలకు, తిరుగుళ్లకు ఖర్చుపెడ్తున్నా డేమో! వాని కెట్లా బుద్ధొస్తదో ఏమోనే లచ్చక్కా"

"ఆఁ.... ఏమైతదిలే... మొగపోరడు... వైసులన్నడు. అక్కడ పగారా (కూలీ) పైస లిచ్చిండ్రో లేదో" సర్ది చెప్పబోయింది.

"పగారా పైసలియ్యకపోతే ఒక లెటరన్నా రాయచ్చుగదా! ఆఠాణా పైసలకే పోస్టుకార్డాయె... నా ఉంగరం అమ్మి వానికి పైసలిచ్చిన గాడిఖర్చులకు, చిల్లర ఖర్చులకని. తిండి గుత్తేదారే పెట్టే...."

"నిజమేననుకో. మొగబాయిగాడు గదా! నువ్వేం ఫికరు వెట్టుకోకు" వేళ్లమీది బీడీకి దారంచుట్టి పక్కన పడేసి, కొంగుతో నుదురు అద్దుకుంది. "నా సంగతేచూడు..." భూలక్ష్మి గొంతు గురగురలాడింది. "ఇద్దరు ఆడపోరల్ని నాకప్పజెప్పి ఆయన మానాన ఆయన తాగి తందనాలాడి లారి కిందపడి సచ్చె" కళ్లను మంచు తెరలు కమ్ముకుంటు న్నాయి.

"అయ్యో లచ్చక్కా! మొగడు సచ్చిండని నువ్వు, బతికున్న మొగని దెబ్బలు భరించ లేక నేను.... రోజూ ఏడుస్తున్నం. నేంజేసిన కష్టమంత నా మొగని తాగుడుకే సరిపాయె. నౌకరి సరిగ జెయ్యకపాయె. రోజూ నిప్పులమీద బొర్లిస్తున్నడనుకో. చిన్నపోరడు బడికిపోతున్నడు గదా... వానికో కలమో, కాపో కొనియ్యాలనే ఇంగితగ్యానం లేదాయె. గిసొంటోనివి లగ్గమెందుకు జేస్కున్నవు, పిల్లలనెందుకు కన్నవంటే... చీకట్ల పండీ, శివుడిస్తే గంటినంటడు. సిగ్గూ షెరమూ అన్నీ గంగల కలిపేసిండనుకో...." జారిపోయిన కొంగును సర్దుకుంటూంటే ఆవేశం పొంగి గుండెలెగసి పడుతున్నై.

"వానింట్ల పీనుగెల్ల. వానికి గత్తరొచ్చి కొట్టుకపోను...." తిట్ల పురాణం సాగిపోతోంది.

"అమ్మా" మూలకు కూచున్న శారద అసహనంగా పిలిచింది. "నన్ను మర్చిపోయినవా?"

"ఏంది బిడ్డా?" భూలక్ష్మి గొంతులో గారాబం.

"నేను బడికిపోవాలే. జల్ది స్నానం చేయించు....."

"మూలకు కూకుండి మూడ్రోజులే అయింది గదా" పోశవ్వకు నవ్వొచ్చింది. "గియ్యాల్లనే ఇంట్లకొస్తవా? కనీసం ఐదు రోజులన్నా కూచోవాలె బిడ్డా. లేకపోతే వైసులున్నప్పుడే ముసలితనమొస్తది" హెచ్చరించింది.

"ఆఁ పాతాలు వోతయి. చెప్పిన పాఠాలు మల్లా చెప్పుమంటే చెప్తరా సార్లు? ట్యూష్యన్‌కు పోవాలంటే పైసలు గావాలె" శారద మనసంతా చదువు మీదుంది.

"ఉండు... నల్లా వస్తుందేమో చూసొస్తా" నంటూ భూలక్ష్మి బయటికెళ్ళి చూసొచ్చింది. "పదకొండు దాటవట్టె. నల్లా లేదు తెల్లా లేదు. వానింట్ల పీనుగెల్ల. ఇంట్ల ఒక్క సుక్క నీళ్లు లేవు" నెత్తి కొట్టుకుంటూ కూచుంది. "మీ ఇంట్ల ఏమన్నా నీళ్లున్నాయా పోశక్కా? ఓ కడివెడు బదులియ్యి. నల్లా రాంగనే ఇస్తా" అనునయంగా అడిగింది.

"వామ్మో!" కరెంటు షాకు కొట్టినట్టు ఝల్లుమంది పోశవ్వకు. "నీళ్లు బదలా?" మూతి మూడు వంకర్లు తిరిగింది. "అయ్యోరామ! అంత అదృష్టమా? ఓ పూట అన్నమంటే దొరుకుతుందిగాని నీళ్లు దొరకవుగదా! గీమున్సిపాల్టీకి పోయేకాలమొచ్చిందేమో! మానేరు నీళ్లొస్తున్నాయని ఆరోజు మంచినీళ్ల పండగ చేయించిరి. కండ్లల్ల నీళ్లొచ్చినై గాని నల్లాలల్ల నీళ్లు రాకపోయె"

"ఆఫీసర్ల కాలనీల, పోలిసోల్ల కాలనీల రోజు నల్లాలొస్తున్నాయి. మనకేమో గీగతి. అయినా మానేరునుండి నీళ్లు వచ్చేదే తక్కువ. మన గుడిసెల గల్లీలకు ముందెట్లా ఇస్తరు? ఇక్కడున్నోళ్లంతా లేబరేనాయె. అక్కడ ఇచ్చినంక మిగిల్తే ఇటిస్తరట. లేక పోతే లేదట"

"నిజమేకాని మన వార్డు కౌన్సిలర్ ఈరన్న కనబడక నెల రోజులాయె. మన కష్టాలన్నీ చెప్పుకుందామంటే... ప్చ్ ఏంలాభం?" పోశవ్వ దృష్టి బయటికెళ్ళింది.

భూలక్ష్మి మనసు కుదుటపడలేదు.

"పోరికి స్నానమెట్లా చేయించాలె. వంటెట్ల చెయ్యాలె? మనసున వద్దలేదే పోశక్కా!" మనసు పొరల నలుముకున్న నిరాశ వేళ్లలో కొచ్చింది. పనిలో స్పీడు మందగించింది.

చెంపలమీదికొచ్చిన వెంట్రుకల్ని సవరించుకుంటుంటే లటుక్కున గుర్తుకొచ్చింది పోశవ్వకు. "అవునుగానీ. ఇయ్యాల్ల సాయంత్రం బీడీలిచ్చి రావాలెగదా! మునీమ్ ఉన్నప్పుడే పోవాలె"

"అవునే పోశక్కా! ఏం చెయ్యాల్నో ఏమోపో..." తలపట్టుక్కూచుంది.

"అమ్మా!" పదమూడేళ్లు నిండని శారద మళ్ళీ పిలిచింది. "నాకు పెయ్యంతా ఎట్లెట్లనో ఉన్నదే. జెల్ది స్నానం చేయించే. ఆకలి కూడా అవుతుంది."

"అయ్యో పాపం! బట్టలు గూడా మార్చాలనే లచ్చక్కా" పోశవ్వకు బాధనిపించింది.

భూలక్ష్మికి ఏడుపొస్తుంది.

"ఏంజెయ్యాలెరా దేవుడా!" జుట్టు పీక్కుంది.

బయట ఎండ తీవ్రమవుతోంది. ఇటు నీటికోసం జనాల గుండెల వేడెక్కుతున్నాయి. ఆ కాలనీలో పక్కా ఇళ్లు పదిశాతం. మిగతావన్నీ గుడిశెలు. అతుకులు బతుకుల్ని గతుకుల రోడ్మమీద నిలబెట్టి రోజుకో పరీక్ష ఎదుర్కోవడం. అక్కడి జనాలకు దినదినగండం నూరేళ్లాయుషులాగైంది. పదవిలో ఉన్న ప్రజానాయకుల దురదృష్టమో, ప్రజల అదృష్టమోగాని త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయనే ప్రభుత్వ ప్రకటన పత్రికల్లో పెద్దక్షరాలతో ప్రత్యక్షమైంది. ఛోటానాయకుల్లో ఉత్సాహం, ఉల్లాసం

ఉరకలేస్తోంది. ఈసారిగూడా కౌన్సిలర్‌గా గెలిచి మాజిక్కులు, లాజిక్కులు ప్రదర్శించి ఛైర్మన్ పదవినలంకరించాలనే ప్రగాఢవాంఛ ఆ వార్డు కౌన్సిలర్ వీరయ్యలో బలంగా పాతుకుపోయింది.

"ఏందే బూలచ్చక్కా? గట్ల కూకున్న వేందే?" వెతకబోయిన తీగ కాళ్లకు తగిలినట్టు వీరయ్య ప్రత్యక్షమయ్యాడు.

ఖద్దరు పాంటు, లాల్చీ, నెత్తిమీద గాంధీటోపి, మెడలో కండువా... హుషారుగున్నట్టుంది. అతని వెంట నలుగురైదుగురు గల్లీ లీడర్లున్నారు.

"వారెవ్వా! వచ్చినవా ఈరన్నా" భూలక్ష్మిలో ఆశాకిరణం మెరిసింది. "నిన్నే గూర్తజేసుకుంటున్నమన్నా. రా" కూచొమ్మని చాపవేసింది.

"గీ గల్లీలున్నోళ్లంతా మన అక్కలూ, చెల్లెండ్లేగదా! ఓట్లు మన ఈరన్నకు గాక ఇంకెవలకేస్తరూ?" ఓ గల్లీనాయుకుడు మురిసిపోతున్నాడు. అవునుగదా? అన్నట్టుగా పోశవ్వవైపు చూస్తూ.

"ఇక్కడి ఓట్ల గురించి ఫికరేలేదు కదా లచ్చక్కా" మరో ఛోటాలీడర్ గల్లా సర్దుకున్నాడు.

"మన గల్లీ నల్లాల నీళ్లురాక ఐదురోజులైందన్నా" పోశవ్వ అందుకుంది. "పాపం! బూలచ్చక్క బిడ్డ పెద్దమనిషైంది. ఇయ్యాల్లస్నానం చేయించాలె" శారదవైపు చూపించింది.

"మా ఓట్లు మా ఈరన్నకుగాక ఇంకెవలకు వడ్తయ్‌గానీ ఇప్పుడు నల్లా నీళ్లు రాకపోతే నా గతి కుక్కగతి అయిపోతదన్నా" భూలక్ష్మి బతిమాలుతోంది. అప్పటికే చుట్టుపక్కల ఆడజనాలు ఖాళీ కడవలతో వచ్చి నుంచున్నారు. మొహాలు మంకెనపువ్వుల్లాగున్నాయి.

వీరయ్య ఉండేది పట్నం నడిబొడ్డున రెండంతస్తుల మేడలో. దాన్ని నాలుగంతస్తుల మేడగా చూడాలనే పట్టుదల బలపడుతోంది. పూటకు గతిలేనోళ్లకు స్వీటు మాటలు చెప్పి తనవైపుకు తిప్పుకోవడం, అతనికి వెన్నతో పెట్టిన విద్య ప్రమాదం వెంటనే పసికట్టాడు.

"ఓర్నీ యవ్వా! నాల్రోజులు నీళ్లు రాలేదా?" అలా ఎన్నడూ జరగనట్టు ముక్కుమీద వేలేసుకున్నాడు. గల్లీలీడర్లను గుర్రుగా చూస్తూ "అరేయ్! మీకెన్ని సార్లు చెప్పాలెరా నల్లాలల్ల రోజూ నీళ్లు రావాలని. రాకుంటే నాకు చెప్పాలేగాని గీ గరీబోల్ల బతుకులతోని ఆడుకుంటార్రా? నీయవ్వ! పందుల లెక్క తిని ఊర పందుల లెక్క ఊరుమీద తిరుగుతున్నరుగదరా! మన అక్కాచెల్లెండ్లు నీళ్లు లేక తల్లడిల్లుతుంటే మీకు సిగ్గూ షెరమూ లేదురా? మున్సిపల్ ఇంజనీర్‌గాని జుట్టుపట్టి అడుగుతా నా ఏరియాకు నల్లా నీల్లెందుకిడుస్తలేడో! గీడ జనాలు తెలివితక్కువోల్లు అనుకుంటున్నాడేమో! పదండిరా" వందిమాగధులతో వెనుదిరిగాడు.

అదంతా నటన అని వెంబడిస్తున్న గల్లీ లీడర్లకు తెలుసు. కావాలనే తలలు నేలకు వేల్లాడేసి వీరయ్య నమసరిస్తున్నారు.

వీరయ్య ఎక్కడికెళ్ళాడో, ఏం చేశాడోగాని కుళాయిల్లో నీళ్లొస్తున్నాయి. బజారు నల్లాల మీదనే ఆధారపడుతున్న కుటుంబాల్లో కలకలం ఎక్కువైంది. మట్టికుండలతో, బిందెలతో నల్లాల చుట్టూ మూగారు. అనుకున్న దేదో సాధించినట్టు మురిసిపోతూ భూలక్ష్మి కూడా రెండు కడవలతో బయలుదేరింది.

బెల్లం చుట్టు ఈగల్లా నల్లా చుట్టూ ఆడవాళ్లు. గుంపు మధ్య నల్లా కనబడలేదు. గద్బడు, గందరగోళం... పమ్మక్క సారక్క జాతరలాగుంది. పోటీలుపడి ముందుకెళ్తున్న కొందర్ని జబ్బబలమున్న జవరాండ్రు జబ్బలుబట్టి జబర్దస్తీగా వెనక్క నెట్టేస్తున్నారు. లొట్టిమీది కాకులలొల్లి, ఊరకుక్కల కొట్లాట.... మనుషులు పశువుల కంటే హీనంగా కన్పిస్తున్నారు.

అంతరాళాల్లో ఆటోలు పరుగుదీసినై. అయినా తప్పదు. నీళ్ళు సంపాదించి తీరాలి. గుంపును చీల్చుకుంటూ పోశ వ్వనిండు కుండతో బయటి కొచ్చింది. సగం తడిసిన చీర, పూర్తిగా తడిసిన జాకెట్టు.... కొప్పు విడిపోయింది. పొడగాటి వెంట్రుకలు మొహమ్మీదికొస్తున్నాయి. యుద్ధభూమిలో వీరోచితంగా పోరాడి విజయగర్వంతో తిరిగొస్తున్నా వీరవనితలాగుంది.

"వామ్మో! నల్లాదాక ఎట్లవోయినవే పోశక్కా!" భూలక్ష్మి కళ్లు అరచేతులంతైపోయినై.

"మా అమ్మ, మా అయ్య అని బతిమాలితే దయజూపే అమ్మలక్కలు లేరిక్కడ" పోశవ్వ పిడికిలి బిగించి చెప్తాంది. "ధైర్యంగా ముందుకువో లచ్చక్కా! అశ్రద్ధ జేస్తే అగమైపోతువు సుమా!" ప్రోత్సహిస్తూ చరచరా వెళ్లిపోయింది.

"నా ముందున్న పోశవ్వ కడవెప్పుడు పట్టుకపోయె? నల్లాదాకా ఎట్లవోయె?" అనుకుంటూ ముందుకెళ్లింది.

"ఓ ఎల్లక్కా, జగదాంబా! జెర లైన్ల వోదామె" తనకంటే వెనకొచ్చి తారాజువ్వల్లా ముందుకు దూసుకెళ్లున్న వాళ్లనడిగింది. "లైన్ల వట్టుకుంటే అందరికి దొరుకతైగదా" సముదాయించబోయింది.

"నువ్వో పిచ్చిదానివిపో!" దులపరించుకుని తోసుకెళ్లిందో స్నేహితురాలు. సిగపట్లు, చీదరింపులు చూస్తుంటే గుండె బేజారైపోతుంది.

శారదకు స్నానం చేయించాలె, వంటజెయ్యాలె... అత్యవసరాలు గుర్తుకొచ్చినై బలన్నింతా కూడదీసుకుని గుండెల నిండాఊపిరి పీల్చుకుంది. రెండు కడవలను ఎడమ చేతిలో పట్టుకుని కుడిచేత్తో కొంగులాగి నడుముకు బిగించుకుంది. బలవంతంగా జనాలను తోసుకుంటూ ఒక్కొక్క అడుగు ముందుకెళ్తోంది.

"జరుగుండ్రి.... జెరపోనియ్యండ్రి నీయవ్వ... నాకిప్పుడు నీళ్లు దొరికితీరాలె. మీ కండ్లల్ల కారంగొట్ట. ఈరన్నను నేనే అడిగినగదా" అరుస్తుంటే అరణ్య రోదనమైపోయింది.

కుండలతో బిందెలు ఒరుసుకుంటున్నై. జబ్బలు రాసుకుంటున్నై. పిడికిళ్లు బిగుసుకుంటున్నై శక్తియుక్తుల్ని మరోసారి కూడ దీసుకున్న తనను వెనక్కు తొయ్యబోతున్న వాళ్ల జబ్బల్ని పట్టి వెనక్కు తోస్తూ ఒక్కొక్క అంగుళము 'ముందుకెళ్తోంది. తన సిగబట్టి

లాగబోయినావిడ చెంపచెళ్లు. మన్నించింది. కడవెడు నీళ్లకోసం కంట్లో ప్రాణాలు పెట్టుకున్న పోరాటం. పావుగంట తంటాలు... ఆఁ నల్లా... నీళ్లు... కనబడుతోంది. కాని నల్లా కింద నాలుగైదు కడవలు, బిందెలు.

"జెర నన్ను పట్టుకోనియ్యండ్రి" గొంతు చించుకుపోయింది.

"ఆ దిగొచ్చింది దొర్సాని" ముక్కూమూతి కలెగలిపి తిప్పేసిన పక్క యువతి, కడవముందుకు తిప్పేసిన పక్క యువతి కడవ ముందుకు తోస్తూ గడ్డు తెరిచింది

అతి కష్టమ్మీద రెండు కడవల్ని ఆ కడవ పక్కన బెట్టి ముందుకు తోసింది. భూలక్ష్మి. నల్లా నీళ్లు చిమ్ముతోంది. అవి మీద పడుతున్నా లక్ష్యపెట్టకుండా లక్ష్యంవైపు కెళ్తోంది.

"ఏయ్! జెర్రాగవే" తన కడవమీద చెయ్యి వెయ్యబోయిన నడివయసామె జబ్బబట్టి వెనక్కు లాగింద. ఓ క్షణం... కళ్లు గిర్రు మన్నై. భుమి బొంగరంలా తిరిగినట్టని పించింది. పడబోయి నిలదొక్కుకుంది. నరాలలోని శక్తినంతా కండరాలలోకి తెచ్చుకుని రెండు కడవల్ని గట్టిగా ముందుకు తోసింది. పక్కనున్న బిందెలు పక్కకు జరిగిపోయినై. తన కడవ ఒకటి నల్లాకిందికొచ్చింది. మరో కడవను నడివయసామె కసిగా తన్నేసింది. కాళ్లమట్టెలు తాకి అది ముక్కులైంది. భూలక్ష్మికి చిర్రెత్తింది. కడవను తన్నిన కాలును కరకర నరికి పారెయ్యాలన్నంత కోపమొచ్చింది.

కాని... కోపం మితిమీరితే నల్లాకిందున్న కడవ కూడా పగిలిపోవచ్చు. బుస్సున పొంగుకొచ్చిన కోపం తుస్సుమంది. తనను తాను తమాయించుకుని రెండు చేతుల్తో జనాల నాపేసింది. హమ్మయ్య! కడవ నిండింది. దోసిలితో నీళ్లుబట్టి గటగటాతాగేసింది. నిండు కడవను నేర్పుగా అందుకుని ఓర్పు, చాకచక్యాన్ని ప్రదర్శిస్తూ, జనాలను నడుముతో లాఘవంగా జరిపేస్తూ గుంపులోంచి బయటికొచ్చింది. పరాక్రమించి పద్మవ్యూహంలోంచి బయటపడి నంత పనైంది.

ఇంటికెళ్లేసరికి ఆయాసమొస్తోంది. నల్లాదగ్గర తాగిన నీళ్లు కడుపులో గలగలమంటున్నాయి. మరో గ్లాసెడు నీళ్లు తాగేసి దమ్ము తీపుకుంది. శారద స్నానం తర్వాత తన స్నానం కూడా ముగించుకుంది. ఇహ వంటకోసం నీళ్ళు కావాలి. త్వరగా వంటజేసి శారదకు తినిపించాలి. తాను తినాలి. మళ్లీ బీడీలు చెయ్యాలి. నాలుగు గంటలకు వెళ్లి బీడీలిచ్చి వారం రోజుల లెక్క చూస్తుకుని రావాలి. గుర్తుకొచ్చేసరికి గుండెల్లో గుండ్రాయి దొర్లింది. చేతులు ఖాళీ కడవ నందుకున్నాయి. కాళ్లు బయటికి సాగినై. జనాలంతా ఖాళీ కడవలతో తిరిగొస్తూ మున్సిపాల్టీని నోరారా తిట్టుకుంటున్నారు. "నల్లా పోయిందే లచ్చక్కా!" చావు కబురు చల్లగా చెప్పి ఖాళీ కడవ చూపించింది. పోశవ్వ. ప్రాణం ఉసూరుమంది.

ఇప్పుడేం. చెయ్యాలి? మూలకు కూచున్న పోరి ముద్దూ ముచ్చటలెట్లా తీరాలె? దాని కింత పాశం చేసిపెట్టాలంటే నీళ్లు లేక పోయె. దేశానికి సొతంత్రమొచ్చి ఎన్నేండ్లాయె. గరీబుతనాన్ని పారదోలేందుకు బోలెడన్ని స్కీములొస్తున్నయట. లక్షల కోట్ల రూపాయలన్ని

ఎటు వోతున్నయో! బట్టపొట్టకు లేని బతుకులెట్లా బాగైతయో! ఆలోచనతోపాటు అడుగులు గుడిసెవైపు పడుతున్నాయి. ఖాళీ కడవ చేతులుంది. అత్యవసరం నెత్తిమీదుంది.

బుర్రలో ఓ మెరుపు మెరిసింది గబుక్కున పక్కకు తిరిగింది. అడుగులు వేగంగా ముందుకు పడుతున్నై. ఐదు నిమిషాల్లో అరకిలో మీటరు నడిచి పటేలు ఇల్లు చేరుకుంది. పటేలు బంగళాలో బోరుబావుంది అప్పుడప్పుడు వాళ్లింట్లో ఏదన్నా పంజేసి ఎంతో కొంత తెచ్చుకోవడం మామూలే.

"ఖాళీ కడవ పట్టుకుని గింత దూరమొచ్చినవేందే భూలక్ష్మీ?" వాకిట్లోనే అడిగింది పటేలమ్మ!" పటేలమ్మ, తన తల్లి పుట్టి పెరిగింది ఒక్క ఊరే.

"పెద్దపోరి పెద్దమనిషైందమ్మా" కడవనేల మీదుంచి దండం బెట్టింది.

"అరెరే గాపోరి గప్పుడే మూలకు కూచుందా" బుగ్గలు నొక్కుకుంది. రూపాయి బిళ్లంత బొట్టు తళుక్కుమంది.

"అవునమ్మా...." నల్లా నీళ్ల సంగతి చెప్పేసి "వంటకు నీళ్లచుక్కలేదు...." ఆశగా చూసింది.

భూలక్ష్మి ఎందుకొచ్చిందో పటేలమ్మకు అర్థమైంది.

"ఐతే ఏందటా?" కావాలనే అడిగింది.

"న్నీ న్నీల్లు... వ్వాక్క కడివిడే"

"పిచ్చిపోరీ! చల్లకొచ్చి ముంత దాచినట్టు నీళ్లకొచ్చి! నీల్లు నముల్త వెందుకే?"

"ఒక్కటే కడివెడమ్మా" కొంచెం ధైర్యమొచ్చింది. కొనకొంగుతో కళ్లు అద్దుకుంది.

"సరేగాని.... ఇయ్యాల్ల పనిమనిషి రాలేదు. జెర.... గా బట్టలు పిండెయ్ బిడ్డా" పటేలమ్మ పెదాల మీద ఆప్యాయత పులుముకుంది.

"సరేనమ్మా!" కడవ పక్కనబెట్టి కొంగునడుముకు చుట్టుకుంది. పనిలోకి దిగిపోయింది. బట్టలకు సబ్బు రుద్దడమైపోయింది. నరాలు డీలాపడిపోయి నట్టుంది. దమ్ము వస్తుంది. చేతులు కడుక్కుని నేల మీద కూచుంది. పూల మొక్కల్ని చూస్తుంది. ముప్పైదాటిన వయసు విశ్రాంతి కోరుతోంది.

చామనఛాయ, చక్కని ముక్కు, చిక్కని తలముంగురులు నున్నని చెక్కిళ్లమీద ఆడుకుంటున్నాయి. ఎత్తైన గుండెలు ఎగసి పడ్తుంటే కందిరీగ రెక్కల్లా కనురెప్పలు టపటపలాడ్తున్నై.

ఎప్పుడొచ్చిండో ఏమో పటేలు పెద్దకొడుకు "భూలక్ష్మీ... నిగనిగలాడి పోతున్నవే" ఫక్కున నవ్విండు.

చట్టుక్కున సర్దుకుంది. బోనులో చిక్కుకున్న ఎలుక పిల్లలా గజగజాడింది. నడుముకున్న కొంగు విప్పి, భుజాలనిండా కప్పుకుంది. ఇటు బట్టలు ఝాడిస్తుంటే దృష్టి అటు తిరుగుతోంది.

పటేలు కొడుకు పరకాయించి చూస్తున్నాడు.

ఫుల్‌షర్టు, టక్ చేసిన పాంటును కళ్లతో చూపిస్తూ పళ్లికిస్తున్నాడు. ఏదో సైగచేస్తూ షర్టు సర్దుకుంటున్నాడు. కళ్లల్లో దురాశ తొంగి చూస్తోంది.

"నీ కండ్లల్ల కంపగొట్ట. బంగారమసొంటి పెండ్లాన్ని ఇంట్లో వెట్టుకుని గట్ల జూస్తవేందిరా బాడ్కావ్" అనాలన్నించింది. కాని కోపం కొంపముంచే స్తుంది. రోషాన్ని దిగ మింగింది.

"బాగున్నవా అన్నా! వదిన తల్లిగారింటికి వోయిందా?" కావాలనే గట్టిగా అడిగింది. అతని భార్య చరచరా వచ్చేసింది... చురచురా చూస్తూ....

"దుకాణం గుమాస్తాకప్పజెప్పి మీరింకా ఇక్కడనే ఉంటే లాభం గువ్వలకొస్తది తెల్సా?" నిలదీసింది... గుడ్లెర్రజేసింది.

"అ.... అ..... దుకాండ్లకు వోవాలెగదూ" తప్పుచేసి పట్టుబడి తప్పించుకుపోతున్న దొంగలా వెనక్కు తిరిగాడు.

"బట్టలైనాయే భూలక్ష్మీ" అంటూ వచ్చింది పటేలమ్మ.

"ఐనయ్. ఆరేస్తున్నా" ఝాడించిన బట్టల్ని ఆరేస్తూ అడిగింది "నీళ్లు కావాలెనమ్మా"

"నీళ్లా! తీస్కపో" పటేలమ్మ మందహాసం. "కాని రోజూ కావాలంటే దొరకవుసుమా" హెచ్చరించింది.

ఇలాంటి హెచ్చరికలు ఇంతకుముందు విన్నవే.

గిసొంటి దినదనగండం నూరేళ్లా యుమ బతుకులల్ల రేపటికి రూపముంటుందా?

భూలక్ష్మి పెదాల మీది నిర్వేదపు చిరునవ్వు నుదిటిమీది మెరుస్తున్న చెమట బిందువుల్ని ప్రశ్నించింది. నెత్తిమీద బరువుతో అడుగులు మందంగా సాగుతున్నాయి.

**విపుల, అక్టోబర్ 2004**

❖ ❖ ❖ ❖

